ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 5 ఆగస్టు 2025
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0



శింగనమల కెనరా బ్యాంకులో సోదనపల్లి రైతు ఆదినారాయణ ఆనందం

పులకించని మది
పులకించె..!

- బ్యాంకులలో సందడే సందడి
- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ సొమ్ము విత్‌డ్రా
- విత్తనాలకు చేసిన అప్పు తీరుస్తామన్న రైతులు
- చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని హర్షం

శింగనమల/ధర్మవరం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ నుంచి రబీ దాకా..! దుక్కి నుంచి పంట అమ్మేదాకా..! ఎప్పుడూ ఏదో ఒక కష్టం..! ఏది ముట్టుకున్నా నష్టం..! ఎప్పుడోగానీ రైతు ముఖం విచ్చుకోదు. నిత్యం ఆలోచనలు, ఆవేదనలతో నిండి ఉండే మట్టి మనిషి ముఖం విప్పారింది. దీనికి కారణం.. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం. అన్నదాత సుఖీభవ తొలివిడ సాయం అందించడం. అదే సమయంలో పీఎం కిసాన్ కింద మరింత సాయం అందడం. కష్టకాలంలో నాలుగు డబ్బులు చేతిలోపడగానే రైతుల ముఖాలు ఆనందంతో వికసించాయి. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకాల సొమ్మును (మిగతా 6లో...)

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

అనంతపురం జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం
గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

05, 06, 07 తేదీల్లో అనంతపురం జిల్లా లోని, కీర్తి రెసిడెన్సి, కమలానగర్, DCMS రోడ్, అనంతపురం నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ. 100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు
సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

టమోటాకు టైమొచ్చింది..!

- ఏడాది తర్వాత ధరలు
- కిలో రూ.30 నుంచి రూ.44 మధ్య పలుకుతున్న వైనం
- అన్నదాతల్లో ఆనందం



అనంతపురంరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు టమోటాకు గిట్టుబాటు ధర దక్కుతోంది. ఏడాదిగా ధరల్లేక రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కూలి ఖర్చులు కూడా దక్కలేదు. కొంత మంది పంటను చేనులోనే వదిలేశారు. ఇంకొందరు తొలగించి, రోడ్డు పక్కనే పడేశారు. గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ అన్నదాతలు రోడ్డెక్కి నినదించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు టమోటా ధర లు పెరుగుతున్నాయి. దీంతో అన్నదాతకు ఉపశమనం దక్కుతోంది.

పెరుగుతున్న ధరలు

జిల్లాలో 5,600 హెక్టార్లలో టమోటా ప్రస్తుతం సాగుతో ఉంది. ఇందులో 30 శాతం వరకు కోత దశలో ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు రోజూ 3 వేల టన్నులకుపైగా టమోటా ఉత్పత్తులు వస్తున్నాయి. ఇతర ప్రాంత మార్కెట్లలోనూ ఆశించిన స్థాయిలో టమోటా ఉత్పత్తులు లేకపోవడం ఇక్కడ ధరల పెరుగుదలకు కారణం. వారం రోజులుగా ధరలు స్థిరంగా పలుకుతున్నాయి. గరిష్ఠంగా రూ.30 నుంచి రూ.44 మధ్య అమ్ముడుపోతున్నాయి. 15కిలోల బాక్సు రూ.450 నుంచి రూ.660 వరకు పలుకుతోంది. గతంలో మచ్చలున్నవి, గోలీల్లాంటి కాయలను పడేసేవారు. ప్రస్తుతం వాటికి కూడా మంచి ధర దక్కుతోంది. ధర కూడా 15 కిలోల బాక్సు రూ.వందకిపైగానే పలుకుతోంది.

ఇతర ప్రాంతాల్లో తగ్గిన ఉత్పత్తులు

జిల్లా నుంచి మదనపల్లితోపాటు పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు టమోటా ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉత్పత్తులు చాలా తక్కువగా వస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో వ్యాపారులు చాలావరకు ఇక్కడి నుంచే కాయలు కొనుగోలు చేసి, ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. వెరసి స్థానిక మార్కెట్‌లో టమోటాకు డిమాండ్ పెరిగింది. వేలంలో కూడా కాయల కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే.. మరో వారం పదిరోజులపాటు ధరలు ఇదేవిధంగా ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పుడిప్పుడే ధరలు పలుకుతున్నాయి



రెండెకరాల్లో టమోటా సాగు చేశా. ఏడో కోత కోశా. 104 బాక్సులు అయ్యాయి. గ్రేడింగ్ చేసిన కాయలు మార్కెట్‌కు తెచ్చా. 77బాక్సులు రూ.500తో అమ్ముడుపోయాయి. మిగిలినవి రూ.250తో వేలంలో పలికాయి. ఈ రోజు అయితే ధర బాగానే పలికాయి. ముందుకోతలో ఈ రేట్లు లేవు. బాక్సు రూ.300లు, రూ.400తో అమ్ముడుపోయాయి. ఇప్పుడిప్పుడు ధరలు పలుకుతున్నాయి. ఇదే విధంగా ఉంటే రైతులకు మేలు జరుగుతుంది.
- చిరంజీవి, రైతు, అపిలేపల్లి, కుందుర్పి మండలం

గతేడాది నష్టాలపాలు

గతేడాది టమోటా సీజన్ ప్రారంభంలో భారీ డిమాండ్ ఉండేది. 15కిలోల బాక్సు రూ.వెయ్యికిపైగానే పలికాయి. వారం, పదిరోజులపాటు ఇదే పరిస్థితి ఉండింది. ఆ తరువాత సీన్ రివర్స్ అయింది. ధరలు పూర్తిగా పడిపోయాయి. తీవ్రస్థాయిలో రైతులు నష్టపోయారు. కూలీల ఖర్చులు కూడా దక్కలేదు. ఈక్రమంలో ఎక్కడపడితే అక్కడ రైతులు కాయలను పడేశారు. కొంతమంది తోటల్లోనే పశువులకు వదిలేశారు. గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కి నిరసనలు కూడా చేశారు.

అన్నదాతల్లో ఆనందం



ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు బాగానే పలుకుతున్నాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులు గతేడాది నష్టాలను చెబుతూనే.. ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బాక్సు రూ.250కిపైగా పలికితే నష్టం ఉండదన్న రైతులు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో (మిగతా 6వ పేజీలో..)

సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను నాణ్యతగా క్షేత్రస్థాయి లో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో పీజీఆర్ఎస్‌కు వచ్చిన వినతులను ఇన్‌చార్జ్ కలెక్టర్ సోమవారం స్వీకరించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, మల్లికార్జునుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నా రు. ప్రజల నుంచి 463 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఆయా శాఖల జిల్లా అధికారులు అలసత్వం వహించరాదన్నారు. సకాలంలో, ఎప్పటికప్పుడు అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. పీ4కు సంబంధించి మార్గదర్శకుల గుర్తింపును వేగవంతం చేయాలని, ఇందులో వెనుకబడిన మండలాల అధికారులకు నోటీసులు ఇవ్వాల న్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఊళ్లు కాదు..
చిట్టడవులు..!

- కురుగుంటలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం
- రెండేళ్లుగా ఇదే దుస్థితి
- నిర్మాణాల పర్యవేక్షణ మరిచిన అధికారులు
- పాడుబడినట్లు కనిపిస్తున్న నిర్మాణ దశలోని ఇళ్లు



ఇళ్ల మధ్య ఉన్న రోడ్డులో పెరిగిన ముళ్లకంపలు

అనంతపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తామని ఊదరగొట్టిన గత పాలకులతీరుతో నేడు పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడం, నిర్వహణ కొరవడటంతో ముళ్ల కంపచెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. పేదల సొంతింటి కలకు గత ప్రభుత్వ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారింది. అనంతపురం రూరల్ మండలం కురుగుంటలోని జగనన్న కాలనీనే ఇందుకు నిదర్శనం. గ్రామ సమీపంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. రెండేళ్లుగా ఇదే పరిస్థితి. సంబంధిత అధికారులు వాటి గురించి పూర్తిగా వదిలేశారు. దీంతో కొంత వరకు కట్టిన ఇళ్లలన్నీ పాడుబడుతున్నాయి.

ఎక్కడికక్కడే ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం
కురుగుంట గ్రామ సర్వే నెంబరు 96-6లో గత ప్రభుత్వం జగనన్న లేఅవుట్ పేరితో కాలనీ ఏర్పాటు చేపట్టింది. కురుగుంట గ్రామంతో పాటు, వైఎస్సార్ కాలనీ, చిన్నంపల్లి, సజ్జలకాలువ తదితర కాలనీలోని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. 190మంది లబ్ధిదారులకు స్థలాలను కేటాయించారు. గత ప్రభుత్వ నిబంధనల మేరకు మూడో ఆప్షన్ కింద అంటే ప్రభుత్వమే ఇళ్ల కట్టించి లబ్ధిదారులకు ఇచ్చేవిధంగా నిర్ణయించి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. అప్పటి స్థానిక ప్రజాప్రతినిదే ఈ కాంట్రాక్టు కూడా తీసుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టాడు. ఆమేరకు 165 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో పదిహేను ఇళ్లు పూర్తి స్థాయిలో నిర్మించారు. మిగిలిన వాటిలో బేస్‌మెంట్ లెవెల్‌లో 28ఉండగా, మిగతావన్నీ చివరి దశకు చేరుకున్నాయి. వీటిలో మరో పదిహేను ప్రారంభం నుంచి నత్తనడకన సాగాయి. దీంతో ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి కాని పరిస్థితి నెలకొంది. బిల్లులు మంజూరు కాకపోవడంతోనే ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. ఆ తరువాత ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడం చకచక జరిగిపోయాయి. ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయన్న క్రమంలో వ్యవహారం కోర్టుకెక్కింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. నూతన ప్రభుత్వంలో వీటి నిర్మాణాలపై ఎలాంటి కదలికలు లేకపోవడంతో ఎక్కడవేసిన లబ్ధిదారులకు నిట్టూర్పులే మిగిలాయి.

నెర్రెలు చీలిన ఇళ్లు
ఇళ్ల నిర్మాణాలు ఎక్కడిక్కడే నిలిచిపోవడంతో వాటి గోడలు నెర్రెలు చీలి కూలడానికి సిద్ధమవుతున్నాయి. ఇళ్ల నిర్మాణ వ్యవహారం కోర్టులో ఉండటంతో సంబంధిత అధికారులు వాటి నిర్వహణను పూర్తిగా వదిలేశారు. దీంతో ఇళ్ల మధ్య ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు మొలచి చెట్లుగా తయారవుతున్నాయి. ఇళ్ల మధ్య రోడ్లలోనూ ఇదే విధంగా తయారైంది. కొన్నిచోట్ల ఇళ్ల గోడలు బీటలు వారాయి. మొండిగోడల స్థాయిలోని ఇళ్ల గోడలు పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన వాటిలో కొంత మంది నివాసముంటున్నారు. నిత్యం విషసర్పాలు సంచరిస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. కనీసం ఇళ్ల మధ్య ఉన్న కంపచెట్లను ఇతరత్ర వాటిని తొలగించాలని కోరుతున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో పురగతి లేకపోవడంతో చాలా మంది ఎంత వరకు నిర్మాణం పూర్తి అయ్యిందో ఆమేరకే రేటు కట్టి అమ్మేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయింటే మరో విధంగా ఉండేదన్న అభిప్రాయాలు ఆయా వర్గాల నుంచి వినిస్తున్నాయి.

గుంతకల్లు మీదుగా వెలంకనికి ప్రత్యేక రైలు 6
7న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

గోవా గవర్నర్‌ను కలిసిన ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజును అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కలిశారు. న్యూ ఢిల్లీలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి సత్కరించారు. గోవా గవర్నర్‌గా అ శోక్ గజపతి రాజు ఇటీవలే బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే.



గవర్నర్ అశోక్ గజపతిరాజుతో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

క్వాలిటీ వసూళ్లు..!

- క్యూసీ సర్టిఫికెట్ కావాలంటే క్యాష్ కొట్టాల్సిందే
- బిల్లులు అయినా.. కాకపోయినా ఇవ్వాల్సిందే
- పీఆర్ క్వాలిటీ కంట్రోల్‌లో పర్సెంటీజీల దందా
- బాస్ తీరుతో కాంట్రాక్టర్ల ఇబ్బందులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ విభాగంలో పైసలిస్తేనే పనులు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చేసిన పనులకు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ పొందాలన్నా దండిగా దుడ్లు సమర్పించుకోవాల్సిందే. ఇంజనీరింగ్ విభాగంలో పర్సెంటేజీల పర్వం సర్వసాధారణం. అయితే క్యూసీ విభాగంలో కూడా అడుగుతుండటంతో కాంట్రాక్టర్లు అల్లాడిపోతున్నారు. ఈ విభాగంలోని బాస్ తమ అవసరాలకు అనుగుణంగా సర్టిఫికెట్ ఇవ్వాలంటే ముందస్తుగానే ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఆ బాస్ నూతనంగా బహుళ అంతస్తులతో కూడిన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందుకు అనుగుణంగానే పర్సెంటేజీల దందాకు శ్రీకారం చుట్టినట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత పల్లె పండుగ పేరుతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టింది. ఇది కాంట్రాక్టర్లకు ఎంత ప్రయోజనం చేసిందో తెలియదు కానీ అధికారులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా క్యూసీ విభాగం అధికారులు పండగ చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. మిగిలిన అధికారులకైతే బిల్లుల చెల్లింపు సమయంలో ఇస్తే సరిపోతుంది. అయితే క్యూసీ విభాగంలో మాత్రం బిల్లు చెల్లింపుతో సంబంధం లేకుండా క్యూసీ రిపోర్ట్ ఇచ్చే సమయంలోనే ఎవరికి ఇవ్వాల్సినది వారికి ముట్టచెప్పాల్సిన పరిస్థితి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు ఈ విభాగంలోని బాస్ తీరుతో మరింత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందన్న చర్చ జరుగుతోంది.

మాది మాకివ్వాల్సిందే..
పంచాయతీరాజ్ విభాగంలోని క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉన్న బాస్ చెప్పే మాటలు, చేసే వ్యవహారాలకు పొంతన లేదన్న ప్రచారం జరుగుతోంది. చెప్పినంత ఇస్తే సరి లేదంటే కోతలేనన్న ప్రచారం విషయంలో జరుగుతోంది. గతంతో పోలిస్తే.. ఈ మధ్య వసూళ్ల మరింత పెంచినట్లు సమాచారం. ఒక పక్క బహుళ అంతస్తులతో కూడిన భవన నిర్మాణం, మరో మెట్టు ఎక్కించే జాబితాలో చోటు దక్కించుకోవడం కోసం వసూళ్లతో లెక్కలు కూడగడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతుంటే ఇలాంటి అధికారుల వేధింపులతో ప్రభుత్వం అపవాదు మూటకట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్న చర్చ జరుగుతోంది. క్యూసీలో జరుగుతున్న పర్సెంటీజీల దందాకు సంబంధించి ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

క్యాంపుల పేరుతో సొంత పనుల్లో నిమగ్నం
పంచాయతీరాజ్ విభాగంలోని క్వాలిటీ కంట్రోల్ విభాగం బాస్ తీరు విమర్శలకు దారి తీస్తోంది. ప్రస్తుతం అసలు పనులే లేవు. నిత్యం క్యాంపుల పేరుతో సొంత పనుల్లో నిమగ్నం అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయానికి చుట్టపుచూపుగా వస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఉదయం వచ్చారంటే.. మధ్యాహ్నం రారు. మధ్యాహ్నం



వచ్చారంటే ఉదయం రారన్న ప్రచారం జరుగుతోంది. ఇక క్యాంపు పేరుతో అసలు కార్యాలయానికే రాకుండా ఉన్న రోజులు కూడ అనేకం ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రికార్డులు సరిగా ఉంటే పెండింగ్ పెట్టం.
క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ కోసం పర్సెంటీజీలు అడుగుతున్నారన్నది అవాస్తవం. ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి అయిన తరువాత వాటికి అనుగుణంగా రికార్డులు రూపొందిస్తారు. అన్నీ సక్రమంగా ఉన్నవాటికి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచము. రికార్డులు సరిగా లేకపోతేనే సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రస్తుతం మా వద్ద ఎలాంటి క్యూసీ సర్టిఫికెట్లు పెండింగ్‌లో లేవు.
- మల్లికార్జున మూర్తి, ఈఈ, క్వాలిటీ కంట్రోల్

- కాగా క్యూసీలో జరుగుతున్న పరెంటేజీల దందాపై పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరడానికి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఉత్తరాల ఊర్వశి

ఒకప్పుడు కడుపు నిండా ఉత్తరాలే. వాటి నిండా ఊసులే..! రోజూ ఎనెన్ని చేతులు లేఖల 'ముద్ద'లను తినిపించేవో..! 'గొంతులో ఇరుక్కుందా..?' అన్నట్లు తట్టి మరీ చూసేవారు. ప్రేమగా చూసుకునేవారు. అలా.. శుభాలు, అశుభాలు, కష్టాలు, కన్నీళ్లు.. ఇలా భిన్నమైన రుచులు ఆరగించేది..! పూటకోసారి పోస్టు మ్యాన్ వచ్చి.. పొట్టంతా శుభ్రం చేసి వెళ్లేవారు. ప్చ్..! కాలం మారిపోయింది. కాగితాల అవసరం తీరింది. ఇంటర్‌నెట్‌లో చిక్కుకుని.. తోకలేని పిట్ట తల్లడిల్లిపోతోంది. ఒకప్పుడు ఎర్రగా బుర్రగా ఎందరిలో ఆకర్షించిన పెట్టె.. వయసు ఉడిగిన ముదుసలిగా మారిపోయింది. ఒడలిన దవడలు, శుష్కించిన శరీరం.. కడుపులో ఒక్క ఉత్తరం ముద్ద పడి ఎన్నేళ్లయిందో..! ఆకలితో అలమటిస్తోంది.
అనంతపురం సైన్స్ సెంటర్..! సమస్యలు, విపత్తుల గురించి చర్చించి.. పరిష్కారం వెతికే ప్రాంతం. అక్కడ దీన స్థితిలో కనిపించింది ఒకనాటి ఈ అందాల తార..! గతం జ్ఞాపకానికి వచ్చిందో ఏమో..! అక్కున చేర్చుకున్నారు. అందంగా తీర్చిదిద్దారు. చూసిన వారికీ గతం గుర్తొచ్చింది. సరదగా కొందరు అయినవారికి లేఖలు రాయడం మొదలు పెట్టారు. అలా మళ్లీ ఆకలి తీరడం మొదలైంది. విషయం తెలుసుకుని.. పోస్టుమ్యాన్ కూడా వెళ్లి కలుస్తున్నాడు. కడుపును కాస్త శుభ్రం చేస్తున్నాడు. మునుపటిలా పొట్ట నిండుగా లేఖాన్నం లేదు..! అయినా.. ఈ వయసులో అంత తిన్నా అరుగుతుందా ఏమిటి..? ఏదో.. నాలుగు ముద్దలు..! చాలు..! ప్రాణం పోకుండా..!
- ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య

టమోటాకు టైమొచ్చింది..!

(5వ పేజీ తరువాయి)

మేలిరకం కాయలు బాక్సు రూ.500కిపైగానే పలుకుతున్నాయి. రెండోరకం రూ.400 వరకు అమ్ముడుపోతున్నాయి.



ధరలు బాగున్నాయి

రెండు విడతలుగా నాలుగెకరాల్లో టమోటా సాగు చేశా. రెండో కోత కోసి 40 బాక్సులు మార్కెట్‌కు తీసుకొచ్చా. బాక్సు రూ.570తో అమ్ముడుపోయాయి. ఇందులో ఖర్చులుపోను బాక్సుకు రూ.500 వస్తుందని అనుకుంటున్నా. ప్రస్తుతం ధరలు బాగున్నాయి. రానున్న రోజుల్లో ఎట్లుంటదో చూడాలి.

- నరసింహులు, రైతు, కమ్మూరు, కూడేరు మండలం

నిరుడు రూ.3లక్షలకుపైగా నష్టపోయా



గతేడాది టమోటా సాగుతో రూ.3లక్షలకుపైగా నష్టపోయా. ప్రస్తుతం రెండు విడతలుగా మూడెకరాల్లో పంట పెట్టా. రూ.లక్షకుపైగా పెట్టుబడులకు వెచ్చించా. మొదటి విడత సాగులో దిగుబడులు వస్తున్నాయి. ఇప్పటికి ఏడో కోత కోశా. 120 బాక్సులు అయ్యాయి. ఇందులో 105బాక్సులు రూ.520తో అమ్ముడుపోయాయి. మరో తొమ్మిది బాక్సులు వందతో అమ్ముడుపోగా.. మాగిన కాయ లు మూడుబాక్సులు రూ.300తో విక్రయించా. ఇదే విధంగా ధరలుంటే నష్టాల నుంచి బయటపడతాం.

- రాజన్న, రైతు, యర్రమల్లెపల్లి, కంబదూరు మండలం

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి)): పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-25 మధ్య డిగ్రీ, బీటెక్ పూర్తీ చేసిన విద్యార్థుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఈనెల 11,12,13 తేదీల్లో హైదరాబాద్ నుంచి కంపెనీ ప్రతినిధులు వచ్చి కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు.

పలు మండలాల్లో వర్షం

కొత్తచెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాలో ఆదివారం రాత్రి పలు మండలాల్లో వర్షం కురిసింది. రొళ్ల మండలంలో 30.4 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. బత్తలపల్లిలో 24.6 మి.మీ., బుక్కపట్నం 26.2 మి.మీ. వర్షపాతం నమోదయింది. మూడు మండలాల్లో 2.25 మి.మీ., ఒక మండలంలో 5మి.మీ., మరికొన్ని మండలాల్లో తేలికపాటిటి వర్షం కురిసిందని కొత్తచెరువు ఏఎస్ఓ గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుంతకల్లు మీదుగా వెలంకనికి ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నాగపట్టణంలో వెలసిన వెలంకని ఆరోగ్యమాత ఉత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాంద్రా టెర్మినస్-వెలంకని ప్రత్యేక రైలు (09093) ఈ నెల 27, సెప్టెంబరు ఆరో తేదీల్లో రాత్రి 9-40 గంటలకు బాంద్రా టెర్మినస్‌లో బయలుదేరి రెండో రోజు ఉదయం 7-40 గంటలకు వెలంకనికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (09094) వెలంకనిలో ఈ నెల 30, సెప్టెంబరు 9 తేదీల్లో అర్ధరాత్రి 12-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం పదిన్నరకు బాంద్రా టెర్మినస్‌కు చేరుకుటుందన్నారు. ఈ ప్రత్యేక రైలు బోరివాలి, వసాయ్ రోడ్, పన్వేల్, లోనావాలా, పూనా, డౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్, ఆ దోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, వెల్లూర్ కంటోన్మెంటు, తిరువన్నమలై, విల్లుపురం, మయిలదుతురై స్టేషన్ల మీదుగా నాగపట్నం చేరుకుంటుందన్నారు.

వేధింపుల ఉపాధ్యాయుడిపై వేటు?

అనంతపురం విద్య, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవహరించిన టీచర్ వేమనారాయణపై సస్పెన్షన్ వేటుపడినట్లు తెలిసింది. విద్యాశాఖ అధికారులు చెబుతున్న వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేమనారాయణ తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని.. తల్లిదండ్రులకు విషయం తెలిపింది. దీంతో వారు.. గ్రామస్థులతో కలిసి మూడురోజుల క్రితం పాఠశాలకు వెళ్లి ఆ టీచర్‌ను తీవ్రంగా మందలించడంతోపాటు హెచ్ఎంకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. హెచ్ఎం.. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో సైతం వైరల్ అయింది. రాష్ట్ర, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సోమవారం టీచర్ వేమనారాయణను సస్పెండ్ చేస్తూ ఫైల్ సిద్ధం చేశారు. డీఈఓ ప్రసాద్‌బాబు సెలవులో ఉండడంతో ఆయన వచ్చిన తర్వాత ఆమోదం తీసుకుని, ఉత్తర్వులు ఇస్తారా.. కలెక్టర్‌కు ఫైల్ పెట్టి అక్కడ ఆమోదం వేయించుకుని జారీ చేస్తారా అనేది తేలాల్సి ఉంది. మొత్తం మీద విద్యార్థినిని వేధించిన టీచర్‌పై వేటు పడింది. ఇది విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మగ్గానికి కరెంటు ఫ్రీ





మగ్గం నేస్తున్న కార్మికుడు

చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచితం

హామీని నిలబెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం
ఈనెల 1వతేదీ నుంచే అమలు
7న ప్రకటించనున్న సీఎం చంద్రబాబు
నేతన్నల హర్షాతిరేకాలు

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నేతన్నలకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. అంధకారంలో ఉన్న మగ్గాలకు వెలుగులు పంచాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిని జాతీయ చేనేత దినోత్సవం రోజు(ఈనెల 7న) ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారికంగా ప్రకటించనున్నారు. అంతుకుముందే ఈనెల 1వ తేదీ నుంచే ఉచిత విద్యుత్‌ను వర్తింపజేయనున్నారు. పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ప్రకటించారు. ఆ మేరకు ఉచిత విద్యుత్‌పై ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలోని చేనేత కార్మికుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం.. చేనేత కార్మికులకు రూ.24 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. మిగతా ఎలాంటి ప్రోత్సాహకాలూ ఇవ్వలేదు. ఫలితంగా రంగులు, రసాయనాలు, జరీ ధరలు విపరీతంగా పెరిగాయి. మగ్గం గిట్టుబాటుకాక ఉత్పత్తి తగ్గించడంతో కార్మికులకు పనిలేక రోడ్డున పడ్డారు. అప్పులతో కాలం వెల్లదీశారు. కొందరైతే మగ్గాన్ని వీడి కూలి పనులకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్.. ధర్మవరంలో చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. నేతన్నల అభ్యర్థన మేరకు ఉచిత విద్యుత్‌పై హామీ ఇచ్చారు. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు నేతన్నల ఇళ్లకు ఉచితంగా 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు విద్యుత్ అందించనున్నట్లు ప్రకటించారు. జిల్లాలో 20 నుంచి 25వేల వరకు మగ్గాలున్నాయి. 30 వేల నుంచి 35వేల వరకు కార్మికులు ఉన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కుటుంబాలకు ఈనెల 7వ తేదీన ఉచిత విద్యుత్ అందించాలని ముందుగా నిర్ణయించినా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వారం రోజుల ముందు అంటే ఈనెల 1 నుంచే పథకాన్ని అమలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్నలకు నెలకు 100 యూనిట్లు విద్యుత్ మాత్రమే ఉచితంగా ఇచ్చింది. ప్రస్తుతం 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తుండడంతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.700 నుంచి రూ.1200 వరకు లబ్ధి చేకూరనుందని విద్యుత్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అంతకుమించి వాడిన దానికి బిల్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ధర్మవరం, ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి, గోరంట్ల, హిందూపురం ప్రాంతాల్లో చేనేత కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే చేనేత కుటుంబాల వివరాలను సేకరిస్తున్న జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారులు త్వరలోనే అర్హులకు ఉచిత విద్యుత్ వర్తింపజేసేలా చర్యలు చేపడుతున్నారు.



ఆర్థిక భారం తగ్గుతుంది

20 ఏళ్లుగా మగ్గం నేస్తున్నా. గతంతో 100 యూనిట్లు మాత్రమే ఉచితంగా ఇచ్చేవారు. అది మగ్గానికి సరిపోయేది కాదు. అదనంగా బిల్లు చెల్లించాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం నెలకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వనుండడంతో ఆర్థిక భారం తగ్గనుంది.

-రామాంజి, చేనేత కార్మికుడు, హమాలీకాలనీ, ధర్మవరం

నేతన్నల వివరాలు ప్రభుత్వానికి పంపాం

నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 7వతేదీ ప్రకటిస్తారు. ఈనెల 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తుంది. 7వతేదీ తరువాత ఉచిత విద్యుత్‌కు ఎవరెవరు అర్హులో తేలనుంది. జిల్లాలో చేనేత కార్మికుల సంఖ్య, విద్యుత్ కనెక్షన్లు తదితర వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపాం.

-రామకృష్ణ, చేనేత జౌళిశాఖ ఏడీ, శ్రీసత్యసాయి జిల్లా

పులకించని మది పులకించె..!

(5వ పేజీ తరువాయి)



అన్నదాత సుఖీభవ సొమ్ముకోసం శింగనమల కెనరా బ్యాంకుకు వచ్చిన రైతులు

డ్రా చేసుకునేందుకు వచ్చిన రైతులతో బ్యాంకులలో సోమవారం సందడి నెలకొంది. శనివారం ఆలస్యం కావడం, ఆదివారం సెలవు కావడంతో డబ్బులు డ్రా చేయలేకపోయారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం బ్యాంకులకు క్యూ కట్టారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమయ్యాక అన్నదాత సుఖీభవ సొమ్ము కోసం రైతులు ఎదురుచూశారు. విత్తనం, ఎరువులు, కూలీల ఖర్చులకు డబ్బులు అవసరం కావడంతో కొందరు అప్పు చేశారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో కొందరు చేసిన అప్పులను తీరుస్తున్నారు.

ఎక్కడెక్కడ ఎంత..?

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా అనంతపురం జిల్లాలోని 31 మండలాల పరిధిలో 2,75,642 మంది రైతులకు తొలివిడత రూ.192.94 కోట్లు జమ అయింది. ఇందులో అన్నదాత సుఖీభవ కింద రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.55.12 కోట్లు వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,65,040 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.132.52 కోట్లు జమ అయింది. పీఎం కిసాన్ పథకం కింద 2,41,774 మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.48.35 కోట్లు వచ్చింది. ఈ జిలాలోఓ మొత్తం రూ.180.87 కోట్లు రైతులకు అందింది.



డ్రా చేసుకున్న డబ్బును చూపుతున్న శింగనమల మండల రైతులు



రైతులకు వరం..

అన్నదాత సుఖీభవ పథకం మాకు వరం. పంటల సాగుకు పెట్టుబడులు వీపరీతంగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, సేద్యపు పనులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.7 వేలు ఇచ్చింది. ఈ కష్టకాలంలో మాకు ఊరట లభిస్తోంది.

- నరసింహారెడ్డి, తుమ్మల, ధర్మవరం మండలం

కూలీల ఖర్చుకు వస్తాయి..



అన్నదాత సుఖీభవ పేరిట సాయం అందించి, చంద్రబాబు రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారు. పంటలు పెట్టాలంటే కూలీలకు, మందులకు విపరీతంగా ఖర్చులు వస్తున్నాయి. ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వడం, మొదటి విడద కింద రూ.7 వేలు జమచేయడం సంతోషానిచ్చింది. కూలీల ఖర్చు భయం లేకుండా పోయింది. లేదంటే కూలీలకు ఇచ్చేందుకు అప్పు చేసేవాళ్లం. రైతులకు సీఎం మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావాలి.

-గుత్తా సూర్యనారాయణ, ఏలుకుంట్ల, ధర్మవరం మండలం

పెట్టుబడులకు ఉపయోగం..



వ్యవసాయ పెట్టుబడులకు అన్నదాత సుఖీభవ నగదు ఉపయోగపడుతుంది. ప్రతి సంవత్సరం పంటలు సాగుచేసే సమయానికి అప్పులు చేస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం నగదు విడుదల చేసింది. పెట్టుబడులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. నా బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమ అయింది. ఎంతో సంతోషంగా ఉంది.

-నరసింహుడు, సంజీవపురం, బత్తలపల్లి

సరైన సమయంలో..



ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ డబ్బులు ఇచ్చారు. అన్నదాత కష్టాలు తెలిసిన నాయకుడు ఆయన. మమ్మల్ని ఆదుకునేందుకు సరైన సమయంలో డబ్బులు విడుదల చేశారు. పంటల పెట్టుబడులకు ఈ సొమ్మును వాడుకుంటాం. బ్యాంకు ఖాతాలో సొమ్ము పడిందని తెలియగానే మా రైతులంతా ఎంతో సంతోషంగా కనిపిస్తున్నారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

-పెద్దినేని వెంకటాద్రి, రైతు, నల్లచెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం

ప్రభుత్వంతో జేఎన్‌టీయూ ఎంఓయూ



మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకుంటున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య తదితరులు

అనంతపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ, రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఆచార్య క్రిష్ణయ్య తెలిపారు. విజయవాడలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ప్రభుత్వ కార్యదర్శి గిరిబాబు, అడిషనల్ సెక్రటరీ ఫర్ లేబర్ గంధం చంద్రుడు లతో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, డీఏపీ ఆచార్య సత్యనారాయణ సోమవారం సమావేశమై ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఉన్న కెమికల్, మెకానికల్, ఎలక్ట్రానికల్ ఫ్యాకల్టీ ఎక్స్‌పర్ట్‌లను ఉపయోగించుకుని పరిశ్రమల్లో సేఫ్టీ ప్రోగామ్స్‌ను మానిటరింగ్ చేస్తారన్నారు. టెక్నికల్ నాలెడ్జ్‌లను, పరిశోధనలకు సంబంధించిన సేఫ్టీ ఎక్విప్‌మెంట్‌ను వాడుకుంటారన్నారు. సేఫ్టీ ఆడిట్ రిపోర్టును పరీక్షించడం, అధ్యయనం చేయడం, దానికి కావలసిన చేర్పులు, మార్పులు చేయడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. దీని వల్ల డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వాళ్లు కావలసిన రీసెర్చ్, ఎక్విప్‌మెంట్‌కు ఆర్థిక సాయం చేస్తారని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇప్పిస్తారన్నారు. కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్‌రావు, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం వైద్యం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఏఎన్ఎం) కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఏఎన్ఎం శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ యశోదమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సుకు మహిళలు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://cfw.ap.nic.in/ ద్వారా దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9491939451, 9446941113 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

పుట్టపర్తిలో భారీ వర్షం



పుట్టపర్తిలో రహదారిపై పారుతున్న వర్షపు నీరు

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పుట్టపర్తిలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గతకొంతకాలంతో ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్న మేఘాలు సోమవారం రాత్రి భారీ వర్షం కురిపించాయి. దీంతో పట్టణంలోని రహదారులన్నీ మోకాలులోతు నీటితో జలమయమయ్యాయి. అలాగే హిందూపురం, గుడిబండ, కొత్తచెరువు, పెనుకొండ, గోరంట్లలలో ఓమోస్తరు వర్షం కురిసింది.

8 మంది మట్కా బీటర్ల అరెస్టు

అనంతపురం క్రైం,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎనిమిది మంది మట్కా బీటర్లు, నిర్వాహకులను అరెస్టు చేసినట్టు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. సోమవారం సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్ఐ రుషేంద్రబాబు.. నిందితుల వివరాలను టూటౌన్‌లో ప్రకటించారు. మట్కా సమాచారం రావడంతో సాయినగర్ 2వ క్రాస్‌లో తనిఖీలు చేశామన్నారు. ఈ సందర్భంగా మట్కా నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి నగదు రూ.1.50 లక్షలు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తల్లిపాలు బిడ్డ హక్కు

జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డ హక్కు అని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు-2025ను ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈనెల 1 నుంచి ఏడో తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలన్నారు. తల్లి పాలు బిడ్డకు తొలి టీకా అన్నారు. జీవితానికి కవచం- ఆరోగ్య భవితకు బలమైన పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలు నిర్వహించాలి

పతి నెలా ఐదో తేదీన అన్ని సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలను నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూభవన్‌లో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జీఓఏపీ, మన మిత్ర-ప్రజలచేతిలో ప్రభుత్వం అనే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఒక నెంబర్‌ద్వారా 200కు పైగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 9552300009 నంబర్‌పై అవగాహన కల్పించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొని అవగాహన కల్పించాలన్నారు.

7న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పుట్టపర్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్‌లో ఈనెల 7న క్యాన్సర్ ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెద్దకమ్మవారిపల్లి రోడ్డులో గల ఆస్పత్రిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలను 35 సంవత్సరాలు దాటిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందస్తుగా 8047103700 నంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

9 నుంచి రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్



ఎంపికైన దివ్యాంగ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా జూనియర్, సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 9 నుంచి ప్రారంభమవుతాయని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విశాఖపట్నంలోని పోలీస్ బ్యాక్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తారన్నారు. జిల్లా నుంచి 40మంది ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల ఏడున విశాఖపట్నానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా రావాలని ఆకాంక్షించారు.

టీటీడీసీని సందర్శించిన కేంద్ర బృందం

అనంతపురం అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ శిక్షణాకేంద్రాన్ని కేంద్ర పథకాల పర్యవేక్షణ బృందం అధికారులు సాంబశివరావు, నవ్య సందర్శించారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు తొలిరోజు టీటీడీసీ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు.. తద్వారా సాధించిన ఫలితాలపై ఆరాతీశారు. అనంతరం ఎస్కేయూ సమీపంలోని రూడ్ సెట్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ నిర్వహించే ఉచిత శిక్షణలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 13వ తేదీదాకా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కమిటీ సభ్యులు పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో పలు రకాల పనులను పరిశీలిస్తారు. మంగళవారం గుంతకల్లు మండలం దోసలుడికి, ఈనెల 6న కొంగనపల్లి, 7న నాగసముద్రం, 8న పుట్లూరు మండలం అరకటివేముల, 9న మడ్డిపల్లి, 10న మడుగుపల్లి, 11న విడపనకల్లు మండలం పాల్తూరు, 12న జనార్దనపల్లి, 13న కలెక్టరేట్‌లో సంబంధితశాఖల అధికారులతో సమావేశమవుతారు.

కేంద్ర బృందానికి సహకరించండి..

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పర్యవేక్షించేందుకు వచ్చిన జాతీయస్థాయి మానిటరింగ్ బృందానికి సహకారం అందించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం, డ్వామా, సంబంధిత శా ఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఈనెల 13 వరకు నేషనల్ లెవల్ మానిటర్ టీం జిల్లాలో పర్యటిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి విజయగాథల వివరాలను వారికి తెలపాలన్నారు. సమావేశంలో కేంద్ర బృందం అధికారులు సాంబశివరావు, నవ్య, డ్వామా పీడీ సలీం బాషా, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, డీఆర్‌డీఏ ఏపీడీలు గంగాధర్, సత్యనారాయణ, సర్వే ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారును ఢీకొన్న లారీ.. ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన లారీ, కారు

పెనుకొండ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం వైజంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. కియ పోలీసులు తెలిపిన మేరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఇంద్రజ, సుధాకర్, ఆద్య, వీరేష్, రాఘవేంద్ర, శశికళ, యశ్వంత్, దీప్తిప్రియ రెండ్రోజుల కిందట తమిళనాడులోని అరుణాచలం శివాలయానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో పెనుకొండ సమీపంలోని హరిపురం వైజంక్షన్ వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించినట్లు తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

- ఎస్పీ ఆఫీస్ వద్దే ఘటన
- అడ్డుకున్న పోలీసులు



పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన బాలకృష్ణ

అనంతపురం క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారులు వేధిస్తూ, తనను, తన భార్యను చంపుతామని బెదిరిస్తున్నారని ఓ ఆటో డ్రైవర్ ఎస్పీ ఆఫీస్ వద్ద సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లికి చెందిన రంగారెడ్డి కొడుకు బాలకృష్ణ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వచ్చాడు. తన అప్పుల సమస్యను పోలీసులకు విన్నవించుకున్నాడు. బయటకు రాగానే కాన్ఫరెన్స్ హాల్ గేటు వద్ద మొక్కల చాటున దాచి పెట్టుకున్న పెట్రోల్‌ను తనపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. దీన్ని అక్కడే ఉన్న పోలీసులు, ప్రజలు గమనించి అప్రమత్తమయ్యారు. వెంటనే అతడిని పక్కకు తీసుకెళ్లి కూర్చోబెట్టి నీళ్లు పోశారు. తర్వాత వివరాలు ఆరా తీశారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేశానన్నాడు. అధిక వడ్డీలు చెల్లించడం, కుటుంబ పోషణకు మళ్లీ అప్పులు చేయాల్సి వచ్చిందన్నారు. మొత్తం రూ.16 లక్షలు అప్పులు అయ్యాయన్నారు. కొంత కాలంగా వడ్డీవ్యాపారులు వేధిస్తున్నారన్నారు. నగరానికి చెందిన రాము, నారపరెడ్డి, భవానీ నగర్‌కు చెందిన వ్యక్తి, అంబారపు వీధికి చెందిన ఈశ్వరయ్య, జిలేంద్ర, మరో వ్యక్తి రామయ్య ఇలా ఇంటి వద్దకు, ఆటో పెట్టుకునే చోటకు వచ్చి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని, బాధితుడికి తోడుగా కానిస్టేబుల్‌ను ఇచ్చి బుక్కరాయసముద్రం పంపారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు



ఆత్మహత్యకు పాల్పడుతున్న వృద్ధురాలిని కాపాడిన ట్రైనీ ఎస్ఐ భువనేశ్వరి

పెనుకొండ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడబోయిన ఓ వృద్ధురాలిని పెనుకొండ పోలీసులు సోమవారం కాపాడారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. రొద్దం మండలం బూదిపల్లి గ్రామానికి చెందిన జయమ్మ పెనుకొండ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరగడాన్ని పెట్రోలింగ్‌కు వచ్చిన ట్రైనీ ఎస్ఐ భువనేశ్వరి, ఏఎస్ఐ నాగరాజు గుర్తించారు. రైలు కిందపడబోతున్న ఆమెను కాపాడారు. విచారించగా భర్త నారాయణప్ప, కుమారుడు, కోడలు ఒకే ఇంటిలో ఉన్నారని అనారోగ్యం కారణంతోనే తాను ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకున్నట్లు ఆ వృద్ధురాలు పోలీసులకు తెలిపారు.

దాడి కేసులో మరో నిందితుడి అరెస్టు



వడ్డీ వ్యాపారి అరెస్టు చూపుతున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌లో చేనేత కార్మికుడు రమణ, ఆయన భార్య భారతిలపై దాడి చేసిన కేసులో ఏడో నిందితుడైన గుజ్జల విజయ్‌కుమార్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపినమేరకు....చేనేత కార్మికుడు రమణ కుటుంబంపై దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఇదివరకే ఐదుగురిని అరెస్టు కూడా చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీ ఉండగా అందులో ఏడో నిందితుడైన గుజ్జల విజయ్‌కుమార్‌ను ధర్మవరం రైల్వేస్టేషన్ వద్ద సోమవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారని సీఐ తెలిపారు.

ఊసేలేని ఉద్యాన ప్రగతి..!

- ఫిబ్రవరిలో అట్టహాసంగా అనంత ఉద్యాన సమ్మేళనం
- ఐదు నెలలు ముగిసినా అతీగతీ లేదు
- ఏడు కంపెనీలతో ఒప్పందాలు
- క్షేత్రస్థాయిలో మొదలుకాని పనులు
- అయోమయంలో రైతులు



అనంత ఉద్యాన సమ్మేళనంలో జిల్లా యంత్రాంగంతో ఒప్పందాలు చేసుకుంటున్న పలు కంపెనీల ప్రతినిధులు (ఫైల్)

అనంతపురం అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అనంతను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పం. ఆ దిశగానే ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో జిల్లా కేంద్రంలో అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య ప్రజాప్రతినిధులతోపాటు పలు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగును మరింతగా ప్రోత్సహించేందుకు ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీనిని ఆదర్శంగా తీసుకుని ఇతర జిల్లాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడం విశేషం. ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంపై అశ్రద్ధ వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే... ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా పెద్దపెద్ద కంపెనీల ప్రతినిధులను ఆహ్వానించి, నిర్వహించిన ఉద్యాన సమ్మేళనం లక్ష్యం నెరవేరడం కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం అట్టహాసంగా ఉద్యాన సమ్మేళనం నిర్వహించడంతో తమకు ప్రయోజనం చేకూరుతుందని ఉద్యాన రైతులు భావించారు. సమ్మేళనంలో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో నిర్దేశించిన పనులు మొదలు పెట్టకపోవడంతో అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

● అతీగతీ లేదాయె..

రాష్ట్రస్థాయిలో ఎన్నడూలేని విధంగా అనంత ఉద్యాన సమ్మేళనం నిర్వహించారు. ఐదు నెలలు ముగిసినా ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమ్మేళనంలో అనంత ఉద్యాన పంటల ప్రాముఖ్యతను వివరించారు. ఇక్కడ పండించిన ఉద్యాన ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి, రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని నిర్ణయించారు. కోతల తర్వాత ఉద్యాన పంటల వ్యర్థాలతో పలు రకాల వస్తువులు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలనుకున్నారు. ఉద్యాన సమ్మేళనంలో గ్రోత్ ఇంజిన్స్ జాబితాలో అరటి, చీనీ, దానిమ్మ, ఎండుమిరప, టమోటా పంటలుఉన్నాయి. మిగతా పంటల ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని నిర్ణయించారు. తొలి అనంత ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి, వచ్చే ఏడాది తిరిగి కార్యక్రమాన్ని నిర్వహించాలనుకున్నారు. గత సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలు.. అమలు విధానం, రైతులకు ఒనగూరిన ప్రయోజనాలను తెలియజేయాలని ఉద్యాన సమ్మేళనంలో జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఉద్యాన సమ్మేళనంలో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల ప్రతినిధులతో ఈ ఏడాది మార్చిలో కలెక్టర్ వినోద్‌కుమార్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న మూడు నెలల్లో ఒప్పందం మేరకు ఏయే పనులు చేపడుతున్నారో ప్రణాళికలు తయారు చేసి, క్షేత్ర స్థాయిలో మొదలు పెట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆయా కంపెనీల ప్రణాళికలు రూపొందిచినట్లు సమాచారం. ఆ మేరకు క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టకపోవడం గమనార్హం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉద్యాన సమ్మేళనం లక్ష్యం నెరవేరడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనంత ఉద్యాన సమ్మేళనం లక్ష్యం ఘనంగా ఉన్నా... అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడం ఏమిటో అర్థం కావడం లేదు.

● కంపెనీల ఒప్పందాలివీ..

అనంత ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలు జిల్లా యంత్రాంగంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. మైక్రో ఆల్గే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (ఆల్గా ఎనర్జీ స్పెయిన్ అనుబంధ సంస్థ), సిద్ధార్థ కోల్డ్ కేర్ (అనంతపురం), కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ (కృష్ణా జిల్లా), గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్ (తెలంగాణ), అగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్ (ఢిల్లీ), అనానా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్, ప్యూర్ ఓ న్యాచురల్ రిటైల్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) కంపెనీలు ఉద్యాన పంటల కొనుగోలు, ఎగుమతికి సంబంధించి జిల్లా యంత్రాంగంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

● మైక్రో ఆల్గే సొల్యూషన్స్

ఈ కంపెనీ బయో ఎరువులు, బయో ఉద్దీపనల కోసం ఆధునాతన మైక్రో ఆల్గే ఆధారిత సాంకేతికతను సమగ్ర పర్చడంలో పాల్గొంటుంది. జిల్లాలో కనీసం 10వేల మంది రైతులు మైక్రో ఆల్గే ఆధారిత బయో ఎరువులు, జీవ ఉద్దీపనలను స్వీకరించేలా చొరవ చూపుతుంది. యూపీటీ ఆధారిత బయో ఇన్‌పుట్‌ల సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

● సిద్ధార్థ కోల్డ్ కేర్

ఈ కంపెనీ పరిధిలో 300 ఎంటీ ప్రీ కూలింగ్ చాంబర్లు, 800 ఎంటీ కోల్డ్ రూమ్‌లు ఉన్నాయి. వీటిని ప్రస్తుతం ఎస్‌కే బనానా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రీ కూల్ చేసేందుకు వినియోగిస్తున్నారు. ఒప్పందం మేరకు సిద్ధార్థ పల్ప్, డీహైడ్రేషన్ యూనిట్లను ఏర్పాటు చేసి పండ్లు, కూరగాయలు తాజాగా ఉండేలా చర్యలు తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

● కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్

అరటి, మామిడి, సీతాఫలం తదితర ఉద్యాన పంటలను ప్రాసెసింగ్ చేస్తారు. తద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తులను లాభదాయకమైన ధరతో విక్రయించేలా చొరవ చూపేందుకు ఒప్పందం చేసుకున్నారు.

● గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్

ఉద్యాన పంట కోతల అనంతరం తగిన సదుపాయాలు కల్పిస్తారు. జిల్లా రైతులకు మద్దతు ధర కల్పించడం, ఇతర ప్రాంతాల్లో ధరలను తెలియజేసి, కొత్త మార్కెటింగ్‌లో మద్దతు ధర లభించేలా చొరవ చూపేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కంపెనీ పంటలకు రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ (ఆర్ఎఫ్ఏ) సర్టిఫికెట్ ఇస్తుంది. దీంతో ప్రపంచంలో ఎక్కడైనా ఆయా పంటలను విక్రయించుకునే అవకాశం ఉంటుంది. పంటల సాగులో ఏయే పద్ధతులు పాటిస్తే ఆర్ఎఫ్ఏ సర్టిఫికెట్ జారీ చేస్తారు..? తదితర అంశాలపై త్వరలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

● ఆగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్

ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణకు ఏయే దశల్లో క్రిమిసంహారక మందులు వాడాలో వివరిస్తారు. మొక్కల ఎదుగుదల కోసం బయో ఎరువులను రైతులకు అందుబాటులోకి తెస్తారు. జిల్లాలోని 13 సంకల్ప్ రిటైల్ స్టోర్ల ద్వారా తక్కువ ధరకు ఎరువులను అందజేసేలా ఒప్పందం.

● అనానా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్

అరటి పంట కోత తర్వాత వ్యర్థాలను తగ్గించేందుకు చర్యలు చేపడతారు. ఈ కంపెనీ ద్వారా అరటి నుంచి వచ్చే నారతో బొమ్మలు, బ్యాగులు, టోపీలు, దుస్తులు తయారు చేసే టెక్నాలజీపై శిక్షణ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో చర్చించి, షెడ్యూల్ మేరకు ఎంపిక చేసిన డ్వాక్రా సంఘాలకు ఆ కంపెనీతో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు.

● ప్యూర్ ఓ న్యాచురల్ రిటైల్ ప్రైవేటు లిమిటెడ్

రైతుల నుంచి నేరుగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. స్థానిక వ్యవసాయ సంఘాలతో మమేకమై తాజా పండ్లు, కూరగాయలను కొనుగోలు చేసేలా ఒప్పందం.

పురంలో ప్రాణభయం..!

- వరుస హత్యలతో జనం బెంబేలు
- పోలీసులకు సవాలుగా మారిన ఘటనలు



హిందూపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరైన హిందూపురంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. ఈ ప్రాంతవాసులు బెంబేలెత్తుతున్నారు. ప్రాణభయంతవణికిపోతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో హత్య జరిగితే అందరూ నివ్వెరపోయేవారు. ప్రస్తుతం నెలలో ఒకట్రెండు హత్యలు జరుగుతుండటంతో పోలీసులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హిందూపురం వాణిజ్యకేంద్రంగా పేరుగాంచింది. పట్టు చీరల కేంద్రంగా ప్రసిద్ధి. ఆసియా ఖండంలోనే అతిపెద్ద చింతపండు, పట్టుగూళ్ల మార్కెట్లు ఉన్నాయి. పలు వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో వరుస హత్యలు ఆందోళన రేపుతున్నాయి. ఇటీవల వెలుగుచూసిన హత్యలకు వివాహేతర సంబంధాలే ప్రధాన కారణంగా తేలుతోంది. చిన్నపాటి గొడవల కారణంగా కూడా హత్య చేయడానికి వెనకాడటంలేదు. క్షణికావేశంలో మనుషులను క్రూరంగా నరికి, పొడిచి చంపుతున్నారు.

ఇటీవల జరిగిన హత్యలు ఇవీ..

- ఈ ఏడాది జూన్ 26న లేపాక్షి మండలం మైదుగోళం వద్ద రవికుమార్ అనే వ్యక్తిని కిరాతకంగా నరికి తల, మొండెం వేరు చేశారు.
- అదేరోజు పరిగి మండలంలో తండ్రిపై కుమారుడు కొడవలితో హత్యకు యత్నించాడు.
- అదేరోజు తూమకుంట చెక్‌పోస్టులో హిందూపురానికి చెందిన రవికుమార్‌ను వైన్‌షాపువద్ద హిందూపురానికి చెందిన వ్యక్తే కత్తితో పొడిచి దారుణంగా హత్యచేశాడు.
- రెండు నెలల క్రితం లేపాక్షి మండలంలో ఒక వ్యక్తిని కిరాతకంగా చంపేసి, ముళ్ల పొదల్లో పడేశారు.
- రెండు నెలల క్రితం పెనుకొండ మండలంలో ఓ మహిళ హత్యకేసు సంచలనం రేకెత్తించింది. వేరే ప్రాంతంలో హత్యచేసి పెనుకొండ మండలంలో పడేసి వెళ్లారు.
- తాజాగా లేపాక్షి మండలంలో తిలక్‌నగర్‌వద్ద ఓ వ్యక్తిని ఆటోలో తీసుకెళ్లి కత్తులతో పొడిచి కిరాతకంగా చంపారు.
- అదేరోజు పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీలో ఓ మహిళను కర్రలతో కొట్టి చంపారు.

పోలీసులకు పెను సవాల్

వరుస హత్యలు పోలీసులకు పెనుసవాల్‌గా మారాయి. ఒక కేసును ఛేదించేలోపే మరొకటి జరుగుతోంది. ఒకప్పుడు ఏడాదిలో ఒకట్రెండు హత్యలు జరిగేవి. దానికే పోలీసు అధికారులు జంకేవారు. ప్రస్తుతం వరుస హత్యలు పోలీసు అధికారుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. ప్రశాంతతకు మారుపేరైన హిందూపురంలో హత్యలు జరగడం ఇక్కడి ప్రజల్లో ఆందోళన కలిగించే అంశం.

క్షణికావేశంలో జీవితాలను నాశనం చేసుకోవద్దు:
- మహేష్, డీఎస్పీ, హిందూపురం

సమస్య, అనుమానం ఉంటే పోలీసులకు చెబితే న్యాయం చేస్తారు. క్షణికావేశంలో విలువైన ప్రాణాలను తీయవద్దు. జైలు పాలు కావద్దు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

టమోటా కిలో రూ.44

అనంతపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్టంగా రూ.44తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.30, సరాసరి ధర రూ.38 పలికినట్లు చెప్పారు. మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3,500, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా950 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చలివిడి తిని అస్వస్థత..!

వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిన బాధితులు



శింగనమల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

శింగనమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పండుగ కోసం తయారు చేసిన చలివిడి, నానవాలు తిని 30మందికిపైగా అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని పెద్దమట్లగొంది గ్రామంలో జరిగింది. శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాల వారు నాగులపుట్టకు పాలు పోసి, పండుగ చేశారు. ప్రసాదాలుగా నల్ల, తెల్ల చలివిడి తయారు చేశారు. పూజల అనంతరం ఆ తినుబండారాలు తిన్నారు. సాయంత్రం నుంచి దాదాపు 30 మందికి పైగా వాంతులు విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. రోజు గడిచినా తగ్గకపోవడంతో కొందరు ఆదివారం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి పరుగు తీశారు. అయినా కొందరికి తగ్గపోవడంతో 22 మందికి పైగా సోమవారం శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పరుగు తీశారు. వారిలో ఓ చిన్నారి తోపాటు లక్ష్మీదేవి, తులశమ్మ, నాగరత్నమ్మ, నారాయణమ్మ, శివయ్య, సుబ్రహ్మణ్యం, రాధమ్మ, పెద్దగంగన్న, సరిత, అనిత నాగేంద్ర, నిర్మల, అమృత తదితరులు ఉన్నారు. శింగనమల ఆసుపత్రిలో వైద్యుడు రోహినాథ్ మెరుగైన సేవలు అందించారు. ఎవరికి ఎలాంటి ప్రాణహాని లేదన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వైద్యులకు సూచించారు.

డీఎంహెచ్ఓ పరామర్శ

శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితులను డీఎంహెచ్ఓ ఈబీదేవి, తరిమెల మెడకల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. ఎంపీడీఓ భాస్కర్, గ్రామ సర్పంచ్ రమేష్, టీడీపీ నాయకులు గుత్తా ఆదినారాయణ వెంకటేశ్ తదితరులు పరామర్శించి, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.



బాధితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

విజేతలకు ఎస్పీ సన్మానం



ఎస్పీతో కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు

అనంతపురం క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించినవారిని జిల్లా ఎస్పీ జగదీష్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్, డిజిటల్ లైబ్రరీ నిరుద్యోగ యువతకు చేయూత అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఇక్కడ ప్రిపేర్ అయిన వారిలో 13 మంది అభ్యర్థులు సివిల్, 10 మంది ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు మాట్లాడుతూ తమకు పోలీస్ శాఖ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్, లైబ్రరీ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఉచితంగా శిక్షణ అందేలా చూసిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ రత్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల్లో డీఎస్పీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఏకకాలంలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇందులో పైపల్లి గ్రామ శివారులో పేకాటాడుతున్న 15మందిని అరెస్టు చేసి రూ 2.03లక్షలు, బుక్కపట్నం మండలం మదిరేబైలు, రెడ్డిపల్లి గ్రామసరిహద్దులో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2.05 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కొత్తచెరువు సీఐ మారుతీ శంకర్, బుక్కపట్నం ఎస్సై కృష్ణమూర్తి వారి సిబ్బందితో ఆయా గ్రామశివారుల్లో రహస్యంగా పేకాడుతున్న ఆడుతున్న వారిని పట్టుకున్నారు. వారి నుంచి మొత్తంగా రూ.4.8 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

హిందూపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానం సమీపంలో రైలు కింద పడి సుమారు 50ఏళ్లున్న వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో లోకో పైలెట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా 5.5అడుగుల ఎత్తు ఉన్న మృతదేహం వారి కంట పడింది. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఎవరైనా గుర్తిస్తే 9440627641కు సమాచారం అందించాలన్నారు.

నేత్రదానం



కుళ్లాయప్ప (ఫైల్)

అనంతపురం వైద్యం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఎక్కులూరి గోపాల్(73) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. గోపాల్ ఉన్నఫలంగా మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. గోపాల్ రెండు నేత్రాలను ఐ రిట్రినల్ సెంటర్ ఆప్తాలమిక్ ఆఫీసర్ రాఘవేంద్ర సేకరించారు. గోపాల్ భార్య రామసబ్బమ్మ, కుటుంబ సభ్యులను జన విజ్ఞాన వేదిక జిల్లా నేత రామకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ అభినందించారు.

ఆదిమరిస్తే .. అంతే సంగతి

●కల్వర్టుపై సిమెంట్ దిమ్మెలు ధ్వంసం ●పొంచి ఉన్న ప్రమాదం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రుద్రంపేట సర్కిల్ సమీపంలో గల నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు కల్వర్టుపై సిమెంట్ దిమ్మెలు ధ్వంసమయ్యాయి. దీంతో పెద్ద రంధ్రం ఏర్పడడంతో ప్రమాదం పొంచి ఉంది. అక్కడికి సమీపంలోని ప్రైవేట్ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో లోడ్ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో సోమవారం కల్వర్టుపై దిమ్మెలు ధ్వంసమయ్యాయి. రుద్రంపేట సర్కిల్ మొదటి క్రాస్ నుంచి డీపీఓ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఈ ప్రమాదం పొంచి ఉంది. అక్కడికి సమీపంలోనే శ్రీ చైతన్య స్కూల్ కూడా ఉంది. ఆ మార్గంలో విద్యార్థుల రద్దీ అధికంగా ఉంటోంది. అయితే అక్కడ ప్రమా దం పొంచి ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏమరుపాటుగా వ్యవహరిస్తే ప్రమాదానికి గురి కా వాల్సిందేనని వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదం జరగకముందే సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


కల్వర్టుపై ధ్వంసమైన దిమ్మెలు

అన్నదాత సుఖీభవ అమలుపై హర్షం


సీఎం చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, రైతులు

రామగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ అమలు చేసినందుకు గాను మండలంలోని నసనకోట పంచాయతీకి చెందిన రైతులు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో సోమవారం వారు వెంకటాపురంలో సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం చేశారు. అనంతరం పరిటాల సునీత మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరైన సమయంలో ఆర్థిక చేయూతనందించేవిధంగా సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశారన్నారు. దీనిపై అన్ని ప్రాంతాలలో రైతులనుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. మొదటి విడతగా రూ.7వేలు అందించారని, మరో రెండు విడతల్లో రూ.13వేలు సాయం అందుతుందని తెలిపారు.

అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యంతో అధికారులు

అనంతపురం క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని అధికారులు సోమవారం పట్టుకున్నారు. విజిలెన్స్, రెవెన్యూ అధికారులు బొమ్మనహాల్ మండలం రంగాపురం క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. అందులో కర్ణాటక రాష్ట్రానికి రేషన్ బియ్యాన్ని కేఏ34-సీ3623 నంబర్ గల బొలేరో లగేజీ వాహనంలో తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం పరిశీలించి 47.10 క్వింటాళ్ల(100 బస్తాలు) రేషన్ బియ్యం ఉన్నట్లు తేల్చారు. తర్వాత బియ్యంతో పాటు ఆ వాహనాన్ని సీజ్ చేసి స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణకు అప్పగించారు. డ్రైవర్ కొత్తకోటగారి నాగరాజు, వాహన యజమాని మఠం వీరభద్రస్వామి, బియ్యం యజమాని రామకృష్ణపై బొమ్మ నహాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ జమాల్ బాషా, డీసీటీఓ సురేష్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి కోరారు. మండల కేంద్రంలోని వాల్మీకి ఆలయంలో సోమవారం సీపీఐ మండల మహాసభ జరిగింది. ఇందులో తొలుత పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బండిరామక్రిష్ణ, సహాయ కార్యదర్శిగా బండల రామాంజనేయులతో పాటు మరో 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. తర్వాత జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో హెచ్చెల్సీ కింద సాగు నీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలుగా ఆదుకోవాలన్నారు. లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో దయనీయ స్థితిలో రైతులు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి
- వారిని ఆదుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి


ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అనంత వెంకటరామి రెడ్డి

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రైతు ల పరిస్థితి దయనీయం గా మారిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి అన్నా రు. తక్షణమే వారిని ఆదుకోవాలంటూ సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వర్షాలు లేక గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఖరీఫ్ పంటలు ఎండిపోయి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఎక్కడ చూసినా భూగర్భజలాలు కూడా అడుగంటిపోతున్నాయన్నారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే ప్రజాప్రతినిధులు సమీక్ష చేసిన పాపాన పోలేదన్నారు. బోర్లు, హెచ్చెల్సీ, హంద్రీనీవా కింద వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసుకున్న రైతులకు యూ రియా, డీఏపీ లభించడం లేదన్నారు. చీనీకి గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించేలా చూడాలన్నారు. హెచ్ఎల్సీ, హంద్రీనీవా ద్వారా నీటి విడుదల జరుగుతున్న నేపథ్యంలో ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు మీటింగ్ నిర్వహించి నీటి కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు ఉదయ్‌కుమార్, ఉపేంద్రరెడ్డి, నరేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ల విడుదల

రాప్తాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి అంగన్వాడీ, వైద్య సిబ్బందితో కలిసి తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య, అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఆనంద్ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరత్న, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి:మండల కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితాకిరణ్‌తో పాటు తహసీల్దార్ , ఎంపీడీఓ , అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. తల్లిపాల ప్రాధాన్యత గురించి అధికారులు వివరించారు. తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని, బిడ్డలకు తల్లిపాలే తాపించాలని తెలిపారు.


రాప్తాడులో పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

గ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత


మన్నీలలో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు


బుక్కచెర్లలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

అనంతపురం రూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల, నరసనాయనికుంట గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు సో మవారం మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమా న్ని నిర్వహించారు. మన్నిలలో జరిగిన కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి షెక్షావలి నాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా వారికి గ్రామస్థులు వివిధ సమస్యలకు పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. అనంతరం నాయకులు అన్నదాత సుఖీభవను అమలు చేసినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, పరిటాల రవి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రాగేమురళి, సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మినారాయణ, సర్పంచు త్రిలోక్ నాయుడు, గ్రామకమిటీ అధ్యక్షుడు రామ్మోహన్, డీలర్లు రాము, వెంకటరాముడు, నాయకులు సూరి, బయన్న, అల్లురామాంజి పాల్గొన్నారు.

రాప్తాడు: బొమ్మేపర్తి, బుక్కచెర్ల గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు మీ సమస్య- మా బాధ్యత కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కరుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, మరూరు, బుక్కచెర్ల సహకార సొసైటీ చైర్మన్‌లు గోపాల్, బ్రహ్మానందరెడ్డి, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

గార్లదిన్నె, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారిగా ఉదయ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుమునుపు ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న గౌతమి ఇటీవల బదిలీపై వెళ్లారు. దీంతో ఆ స్థానంలోకి ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్ బదిలీపై వచ్చారు. సిబ్బంది ఆయనకు శుభకాంక్షలు తెలిపారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం: ఎస్ఎఫ్ఐ

శింగనమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారమవుతాయని జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ పేర్కొన్నారు మండలకేంద్రంలో సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం జరిగింది. ఇందులో ఓతూరు పరమేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తామని తెలిపారు. నాయకులు నాగేంద్రప్రసాద్, గిరి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతకు తగ్గట్టుగా హైవేల నిర్మాణం

● నేషనల్ హైవే విభాగం ఎస్ఈ హరిప్రసాద్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పద్ధతులకు తగ్గట్టుగా నేషనల్ హైవేల నిర్మాణం ఉండాలని నేషనల్ హైవే విభాగం ఎస్ఈ హరిప్రసాద్ సిబ్బందికి సూచించారు. రాయలసీమ జిల్లాలోని ఎన్‌హెచ్ సర్కిళ్ల సిబ్బందికి సోమవారం ఆయన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ జూమ్ మీట్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్అండ్‌బీ రోడ్లకు, ఎన్‌హెచ్ రోడ్లకు చాలా వ్యత్యాసాలు ఉంటాయన్నారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుందని సూచించారు. ప్రధానంగా నూతనంగా ఆర్అండ్‌బీ నుంచి ఎన్‌హెచ్‌కు బదిలీపై వచ్చిన వారు ఆయా ప్రాంతాల్లో మరింత జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఎన్‌హెచ్‌లో ఈపీసీ ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్ట్‌కు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఎన్‌హెచ్‌లో కాంట్రాక్టర్ డిజైన్ చేసుకొని వచ్చిన తరువాత అందుకు అనుగుణంగా అధికారులతో అనుమతులు పొందాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా ఎలాంటి లోపాలకు తావులేకుండా తగిన చర్యలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. ఈఈ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఈ చెప్పిన సూచనలు చాలా ప్రయోజనకరంగా ఉన్నాయని, అన్ని సర్కిళ్లలోని సిబ్బంది వాటిని పాటించి హైవేల నిర్మాణంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని తెలిపారు. ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఏ టూ ఈఈ రామచంద్రారెడ్డి, అనంతపురం డీఈ నాగరాజు, తాడిపత్రి డీఈ రాధిక, పుట్టపర్తి డీఈ గిడ్డయ్య, ఏఈఈ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

అనంతపురం వైద్యం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సోమవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఆత్మారామ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు ప్రత్యేక శిక్షణ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందుకు ఇంటింటి సర్వే విధానాలపై అవగాహణ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు మధుసూదన్, రాజేష్, మేనేజర్ రజిత, ఎన్‌సీడీ సిబ్బంది ప్రేమ్‌బాబు, కిషోర్, శ్రీరాములు, మౌనిక, శశికళ తదితరులు పాల్గొన్నారు.

'ఇతరుల ప్రవేశం నిషేధం అభినందనీయం'


అమిలినేని సురేంద్రబాబుతో అపుస్మా నాయకులు

అనంతపురం,విద్య, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు జరిగే సమయంలో వాటిల్లోకి ఇతరులు ప్రవేశం చేయడానికి అవకాశం లేకుండా నిషేధిత ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ప్రైవేట్‌స్కూళ్ల యాజమాన్యాలు ఆనందం వ్యక్తం చేశాయి. జిల్లాకేంద్రంలో సోమవారం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును అపుస్మా సంఘం నాయకులు కలిశారు. ఈసందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నేత కుసుమాపుల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాయుడు మాట్లాడుతూ పాఠశాలలు జరిగే సమయంలో ఇతరులు సంఘాల పేరుతో స్కూళ్లలోకి వచ్చి వివిధ రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో విద్యాశాఖ కమిషన్ పాఠశాలల సమయంలో ఇతరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పకుండా అమలు చేస్తూ విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే వద్ద పేర్కొన్నారు. సంఘం నాయకులు రవిశంకరప్రసాద్, చంద్ర, జ్ఞానభారతి రమేష్, నాగరాజు, మోహన్, సూర్యనారాయణరెడ్డి, కొత్తపల్లి బాబు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి


వినతులు స్వీకరిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న 6నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక నగరపాలక సంస్థలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అందులో డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఈ రాజశేఖర్, ఏసీపీ శిరీష ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రధానంగా మున్సిపల్ పాఠశాలల్లో అనేక ఏళ్లుగా పని చేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, దీంతో నానా అవస్థలు పడుతున్నారని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ తెలిపారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, కార్మికులు రఫీ, అసేన్, శివ, కుళ్ళాయప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు 12 వినతిపత్రాలు సమర్పించారు.

వాహనాలు రాంగ్‌రూట్‌లో రాకూడదు: డీఎస్పీ

రాప్తాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో నుంచి వచ్చే వాహనాలు రాంగ్ రూట్‌లో జాతీయ రహదారిలోకి రాకూడదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు సూచించారు. స్థానిక తన కార్యాలయం వద్ద సోమవారం ఆయన ఆటోనగర్ కార్మికులతో మాట్లాడారు. రిపేరీ అనంతరం ఆటోనగర్ నుంచి వచ్చే వాహనాలు ఆపోజిట్‌లో వస్తున్నాయనీ, దీనివల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. అలా కాకుండా లింగనపల్లి క్రాస్ వద్ద యూటర్న్ తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో రాప్తాడు సీఐ శ్రీహర్ష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ

గార్లదిన్నె, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నూ తనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గత నాలుగు రోజుల నుంచి ఆలయం వద్ద ఆర్యవైశ్యులు వేద పండితుల చేత వివిధ పూజలు, హోమాలు చేయించారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వాసవీమాత విగ్రహాన్ని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి పురవీధుల గుండా ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, చెక్క భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు సందడిగా జరిగింది. సోమవారం ఉదయం ఆలయంలో వాసవీమాత, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగప్రతిమలను వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముడియం రమణ, రాయలసీమ రీజినల్ చైర్మన్ చంద్రమహేష్, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు శబరి, రాష్ట్ర నాయకులు పోతుల సురేష్, కల్లూరు రామ్‌ప్రసాద్. అనంతపురం పెరుమాళ్, శ్రీరామ్, కొండయ్య, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి శివ, కార్యవర్గ సభ్యులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ప్రతిష్ఠించిన వాసవీమాత, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలు

మొదటి కొబ్బరికాయ వేలం రూ.51,116

ప్రతిష్ఠ అనంతరం వాసవీమాత విగ్రహం వద్ద మొదటి కొబ్బరికాయ కొట్టేందుకు ఆర్యవైశ్యులు భారీగా పోటీపడ్డారు. దీంతో కొబ్బరికాయను బహిరంగ వేలం వేయగా గార్లదిన్నెకు చెందిన మిట్టా వెంకటరమణయ్య రూ. 51,116కి దక్కించుకున్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి: ఏఐఎస్ఎఫ్


నల్లచొక్కాలతో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమవసతిగృహాల్లో కనీస వసతులు, నాణ్యమైన భోజనం లేవని, దీంతో విద్యార్థులు నరకం అనుభవిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నేతలు మండిపడ్డారు. వెంటనే హాస్టళ్లలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో సోమవారం నల్లచొక్కాలు ధరించి ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ వద్దకు చేరుకొని అక్కడ ప్లకార్డులు ప్రదర్శిస్తూ హాసళ్లలో సమస్యలు పరిష్కరించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఏఐఎస్ఎఫ్‌జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు మాట్లాడుతూ.. జిల్లాలోని హాస్టళ్లను పదిరోజుల పాటు సందర్శించి సమస్యలను తెలుసుకున్నామన్నారు. అనేక హాస్టళ్లలో కనీస వసతులులేక పిల్లలు నరకం అనుభవిస్తున్నారన్నారు. సరిపడా మరుగుదొడ్లు, తాగునీరు లేక అవస్థలు పడుతున్నారన్నారు. నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. వార్డెన్లు, వంటమనుషులు, ఇతరసిబ్బంది విధులకు సక్రమంగా వెళ్లడం లేదన్నారు. హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి అధిరారులు, పాలకులు కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఆంజనేయులు, నరసింహయాదవ్, మంజునాథ్, వినోద్, నవీన్, పవన్, రాజేష్, సమీర్,మురళి తదితరులు పాల్గొన్నారు.

'అకడమిక్ ఫోరమ్ కమిటీలతో బోధనకు ఆటంకం'

అనంతపురం విద్య, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో బోధనా విధానాలు సక్రమంగా అమలు జరుగుతున్నాయా అని పరిశీలించడానికి ఏర్పాటు చేసిన అకడమిక్ ఫోరమ్ కమిటీల వల్ల భోదనకు ఆటంకం కలిసి పిల్లలకు అన్యాయం జరుగుతోందని గిరిజన ఉపాధ్యాయసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రవీంద్రనాథ్ సోమవారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాస్థాయిలో 28మంది స్కూల్ అసిస్టెంట్లు, మండల స్థాయిలో ప్రతిమండలంలో 7మంది ఎస్జీటీలను అకడమిక్ ఫోరమ్ కమిటీలుగా ఏర్పాటు చేశారన్నారు. ఈకమిటీలలో ఉన్న టీచర్లు వారానికి రెండురోజుల పాటు పాఠశాలల పరిశీలనకు వెళ్తారన్నారు. దీనివల్ల వారి పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పేవారే లేకుండా అవుతున్నారన్నారు. దీనివల్ల బోధన లేక విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇలా జరగకుండా చూడాలని ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

నాణ్యమైన ప్రాజెక్టులు తయారుచేసేలా తీర్చిదిద్దాలి

● టీచర్లకు ఇన్‌చార్జి డీఈఓ మల్లారెడ్డి సూచన


మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో నాణ్యమైన ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సైన్స్, మ్యాథ్స్ టీచర్లకు ఇన్‌చార్జి డీఈఓ మల్లారెడ్డి సూచించారు. ప్రాజెక్టుల ఎంపిక, నమోదుపై సోమవారం ఆయా టీచర్లకు జిల్లా సైన్స్‌సెంటర్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులలో పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి సైన్స్ ప్రాజెక్టుల తయారీ,ప్రదర్శన ఎంతో ఉపయోగపడతాయన్నారు. టీచర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యార్థులకు సైన్స్‌ప్రాజెక్టుల ప్రాధాన్యత తెలియజేస్తూ కొత్తకొత్త ఆలోచనలతో నాణ్యమైన ప్రాజెక్టులు తయారుచేయించేలా చూడాలని సూచించారు. తర్వాత శిక్షకులు ప్రాజెక్టుల ఎంపిక, ఆన్‌లైన్‌లో నమోదు ఎలాచేయాలి, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థికసాయం, సైన్స్‌ఫేర్‌నిర్వహణగురించి టీచర్లకు అవగాహన కల్పించారు.

టమోటాకు టైమొచ్చింది..!

(5వ పేజీ తరువాయి)

మేలిరకం కాయలు బాక్సు రూ.500కి పైగానే పలుకుతున్నాయి. రెండోరకం రూ.400 వరకు అమ్ముడుపోతున్నాయి.



ధరలు బాగున్నాయి

రెండు విడతలుగా నాలుగెకరాల్లో టమోటా సాగు చేశా. రెండో కోత కోసి 40 బాక్సులు మార్కెట్‌కు తీసుకొచ్చా. బాక్సు రూ.570తో అమ్ముడుపోయాయి. ఇందులో ఖర్చులుపోను బాక్సుకు రూ.500 వస్తుందని అనుకుంటున్నా. ప్రస్తుతం ధరలు బాగున్నాయి. రానున్న రోజుల్లో ఎట్లుంటదో చూడాలి.

- నరసింహులు, రైతు, కమ్మూరు, కూడేరు మండలం

నిరుడు రూ.3లక్షలకుపైగా నష్టపోయా



గతేడాది టమోటా సాగుతో రూ.3లక్షలకుపైగా నష్టపోయా. ప్రస్తుతం రెండు విడతలుగా మూడెకరాల్లో పంట పెట్టా. రూ.లక్షకుపైగా పెట్టుబడులకు వెచ్చించా. మొదటి విడత సాగులో దిగుబడులు వస్తున్నాయి. ఇప్పటికి ఏడో కోత కోశా. 120 బాక్సులు అయ్యాయి. ఇందులో 105బాక్సులు రూ.520తో అమ్ముడుపోయాయి. మరో తొమ్మిది బాక్సులు వందతో అమ్ముడుపోగా.. మాగిన కాయ లు మూడుబాక్సులు రూ.300తో విక్రయించా. ఇదే విధంగా ధరలుంటే నష్టాల నుంచి బయటపడతాం.

- రాజన్న, రైతు, యర్రమల్లెపల్లి, కంబదూరు మండలం

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి)): పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-25 మధ్య డిగ్రీ, బీటెక్ పూర్తీ చేసిన విద్యార్థుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఈనెల 11,12,13 తేదీల్లో హైదరాబాద్ నుంచి కంపెనీ ప్రతినిధులు వచ్చి కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు.

పలు మండలాల్లో వర్షం

కొత్తచెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాలో ఆదివారం రాత్రి పలు మండలాల్లో వర్షం కురిసింది. రొళ్ల మండలంలో 30.4 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. బత్తలపల్లిలో 24.6 మి.మీ., బుక్కపట్నం 26.2 మి.మీ. వర్షపాతం నమోదయింది. మూడు మండలాల్లో 2.25 మి.మీ., ఒక మండలంలో 5మి.మీ., మరికొన్ని మండలాల్లో తేలికపాటిటి వర్షం కురిసిందని కొత్తచెరువు ఏఎస్‌ఓ గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుంతకల్లు మీదుగా వెలంకనికి ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నాగపట్టణంలో వెలసిన వెలంకని ఆరోగ్యమాత ఉత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాంద్రా టెర్మినస్-వెలంకని ప్రత్యేక రైలు (09093) ఈ నెల 27, సెప్టెంబరు ఆరో తేదీల్లో రాత్రి 9-40 గంటలకు బాంద్రా టెర్మినస్‌లో బయలుదేరి రెండో రోజు ఉదయం 7-40 గంటలకు వెలంకనికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (09094) వెలంకనిలో ఈ నెల 30, సెప్టెంబరు 9 తేదీల్లో అర్ధరాత్రి 12-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం పదిన్నరకు బాంద్రా టెర్మినస్‌కు చేరుకుటుందన్నారు. ఈ ప్రత్యేక రైలు బోరివాలి, వసాయ్ రోడ్, పన్వేల్, లోనావాలా, పూనా, డౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్, ఆ దోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, వెల్లూర్ కంటోన్మెంటు, తిరువన్నమలై, విల్లుపురం, మయిలదుతురై స్టేషన్ల మీదుగా నాగపట్నం చేరుకుంటుందన్నారు.

వేధింపుల ఉపాధ్యాయుడిపై వేటు?

అనంతపురం విద్య, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవహరించిన టీచర్ వేమనారాయణపై సస్పెన్షన్ వేటుపడినట్లు తెలిసింది. విద్యాశాఖ అధికారులు చెబుతున్న వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మసముద్రం మండలం గుండెగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేమనారాయణ తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని.. తల్లిదండ్రులకు విషయం తెలిపింది. దీంతో వారు.. గ్రామస్థులతో కలిసి మూడురోజుల క్రితం పాఠశాలకు వెళ్లి ఆ టీచర్‌ను తీవ్రంగా మందలించడంతోపాటు హెచ్‌ఎంకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం.. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో సైతం వైరల్ అయింది. రాష్ట్ర, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సోమవారం టీచర్ వేమనారాయణను సస్పెండ్ చేస్తూ ఫైల్ సిద్ధం చేశారు. డీఈఓ ప్రసాద్‌బాబు సెలవులో ఉండడంతో ఆయన వచ్చిన తర్వాత ఆమోదం తీసుకుని, ఉత్తర్వులు ఇస్తారా.. కలెక్టర్‌కు ఫైల్ పెట్టి అక్కడ ఆమోదం వేయించుకుని జారీ చేస్తారా అనేది తేలాల్సి ఉంది. మొత్తం మీద విద్యార్థినిని వేధించిన టీచర్‌పై వేటు పడింది. ఇది విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పులకించని మది పులకించె..!

(5వ పేజీ తరువాయి)

డ్రా చేసుకునేందుకు వచ్చిన రైతులతో బ్యాంకులలో సోమవారం సందడి నెలకొంది. శనివారం ఆలస్యం కావడం, ఆదివారం సెలవు కావడంతో డబ్బులు డ్రా చేయలేకపోయారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం బ్యాంకులకు క్యూ కట్టారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమయ్యాక అన్నదాత సుఖీభవ సొమ్ము కోసం రైతులు ఎదురుచూశారు. విత్తనం, ఎరువులు, కూలీల ఖర్చులకు డబ్బులు అవసరం కావడంతో కొందరు అప్పు చేశారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో కొందరు చేసిన అప్పులను తీరుస్తున్నారు.

ఎక్కడెక్కడ ఎంత..?

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా అనంతపురం జిల్లాలోని 31 మండలాల పరిధిలో 2,75,642 మంది రైతులకు తొలివిడత రూ.192.94 కోట్లు జమ అయింది. ఇందులో అన్నదాత సుఖీభవ కింద రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.55.12 కోట్లు వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,65,040 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.132.52 కోట్లు జమ అయింది. పీఎం కిసాన్ పథకం కింద 2,41,774 మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.48.35 కోట్లు వచ్చింది. ఈ జిలాలోఓ మొత్తం రూ.180.87 కోట్లు రైతులకు అందింది.



అన్నదాత సుఖీభవ సొమ్ముకోసం శింగనమల కెనరా బ్యాంకుకు వచ్చిన రైతులు





డ్రా చేసుకున్న డబ్బును చూపుతున్న శింగనమల మండల రైతులు

రైతులకు వరం..



అన్నదాత సుఖీభవ పథకం మాకు వరం. పంటల సాగుకు పెట్టుబడులు వీపరీతంగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, సేద్యపు పనులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం పెటుబడి సాయం కింద రూ.7 వేలు ఇచ్చింది. ఈ కష్టకాలంలో మాకు ఊరట లభిస్తోంది.

- నరసింహారెడ్డి, తుమ్మల, ధర్మవరం మండలం

కూలీల ఖర్చుకు వస్తాయి..



అన్నదాత సుఖీభవ పేరిట సాయం అందించి, చంద్రబాబు రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారు. పంటలు పెట్టాలంటే కూలీలకు, మందులకు విపరీతంగా ఖర్చులు వస్తున్నాయి. ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వడం, మొదటి విడద కింద రూ.7 వేలు జమచేయడం సంతోషానిచ్చింది. కూలీల ఖర్చు భయం లేకుండా పోయింది. లేదంటే కూలీలకు ఇచ్చేందుకు అప్పు చేసేవాళ్లం. రైతులకు సీఎం మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావాలి.

-గుత్తా సూర్యనారాయణ, ఏలుకుంట్ల, ధర్మవరం మండలం

పెట్టుబడులకు ఉపయోగం..



వ్యవసాయ పెట్టుబడులకు అన్నదాత సుఖీభవ నగదు ఉపయోగపడుతుంది. ప్రతి సంవత్సరం పంటలు సాగుచేసే సమయానికి అప్పులు చేస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం నగదు విడుదల చేసింది. పెట్టుబడులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. నా బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమ అయింది. ఎంతో సంతోషంగా ఉంది.

-నరసింహుడు, సంజీవపురం, బత్తలపల్లి

సరైన సమయంలో..



ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ డబ్బులు ఇచ్చారు. అన్నదాత కష్టాలు తెలిసిన నాయకుడు ఆయన. మమ్మల్ని ఆదుకునేందుకు సరైన సమయంలో డబ్బులు విడుదల చేశారు. పంటల పెట్టుబడులకు ఈ సొమ్మును వాడుకుంటాం. బ్యాంకు ఖాతాలో సొమ్ము పడిందని తెలియగానే మా రైతులంతా ఎంతో సంతోషంగా కనిపిస్తున్నారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

-పెద్దినేని వెంకటాద్రి, రైతు, నల్లచెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం

9 నుంచి రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్



ఎంపికైన దివ్యాంగ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా జూనియర్, సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 9 నుంచి ప్రారంభమవుతాయని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విశాఖపట్నంలోని పోలీస్ బ్యాక్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తారన్నారు. జిల్లా నుంచి 40మంది ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల ఏడున విశాఖపట్నానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా రావాలని ఆకాంక్షించారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం వైద్యం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఏఎన్‌ఎం) కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఏఎన్‌ఎం శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ యశోదమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సుకు మహిళలు మాత్ర మే అర్హులన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://cfw.ap.nic.in/ ద్వారా దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9491939451, 9446941113 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బొమ్మనహాళ్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్టలో అనారోగ్యంతో జంగమ లక్ష్మీదేవి (85) సోమవారం మరణించింది. ఆమె మృతదేహానికి టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ. ఐదు వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. వారి వెంట సొసైటీ చైర్మన్ ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు లారీచంద్రారెడ్డి, వెంకటేశులు, తిప్పేస్వామి, లింగప్ప ఉన్నారు.

రథం నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

కూడేరు, ఆగస్టు 4, (ఆంధ్రజ్యోతి): జోడులింగాల సంగమేశ్వరస్వామి నూతన రథం నిర్మాణానికి కూడేరుకు చెందిన శ్రీధర్‌రావు రూ. 1.20 లక్షలు, తిక్కన్నగారి సంగప్ప రూ. 25 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవా రం అందజేశారు. రథం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఆ కమిటీ సభ్యులు కోరారు.

దూదేకుల సేవా సంఘం ఏర్పాటు

తాడిపత్రి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పుట్లూరు రోడ్డులోని దూదేకుల సేవా సంఘం కార్యాలయంలో సోమవారం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా హుస్సేన్‌పీరా, కార్యదర్శిగా హుస్సేన్‌పీరా, కోశాధికారిగా మహబూబ్‌సాబ్‌ను ఎన్నుకున్నారు.

7న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పుట్టపర్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్‌లో ఈనెల 7న క్యాన్సర్ ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెద్దకమ్మవారిపల్లి రోడ్డులో గల ఆస్పత్రిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలను 35 సంవత్సరాలు దాటిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందస్తుగా 8047103700 నంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

పాఠశాలల తనిఖీ

విడపనకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలను, కేజీబీవీ పాఠశాలను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సారి టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఆ కమిటీ సభ్యుడు హరిప్రసాద్‌యదవ్ సూచించారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

యాడికి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూట్రాళ్లపల్లి వీఆర్‌ఏ రామకృష్ణ (63) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. పలువురు వీఆర్వోలు, వీఆర్‌ఏలు రామకృష్ణ మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రామకృష్ణ భార్య నాగమ్మకు రూ.15వేలను అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురంక్యాంపు వద్ద ఓ వాహనంలో తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం విజిలెన్స్ సీఐ జమాల్‌బాషా తెలిపారు. ఆ వాహనాన్ని సీజ్ చేసి.. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తల్లిపాలు బిడ్డ హక్కు

జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డ హక్కు అని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు-2025ను ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈనెల 1 నుంచి ఏడో తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలన్నారు. తల్లి పాలు బిడ్డకు తొలి టీకా అన్నారు. జీవితానికి కవచం- ఆరోగ్య భవితకు బలమైన పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలు నిర్వహించాలి

పతి నెలా ఐదో తేదీన అన్ని సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలను నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూభవన్‌లో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జీఓఏపీ, మన మిత్ర-ప్రజలచేతిలో ప్రభుత్వం అనే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఒక నెంబర్‌ద్వారా 200కు పైగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 9552300009 నంబర్‌పై అవగాహన కల్పించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొని అవగాహన కల్పించాలన్నారు.

ఇళ్ల పట్టాల కోసం జర్నలిస్టుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

తాడిపత్రి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తమకు ఆరోగ్య బీమా కల్పించాలని, ఇళ్లపట్టాలు ఇవ్వాలని, పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు జర్నలిస్టులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రోత్సాహక బహుమతులు

తాడిపత్రి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేరన్నపల్లి జడ్పీ హైస్కూల్‌లో గత మార్చిలో జరిగిన 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. 476, 459, 389 మార్కులు సాధించిన ఫర్హానా, దీక్షిత, అఫ్రీన్‌లకు వరుసగా రూ.5వేలు, 3వేలు, 2వేలు అందజేసినట్లు చేసినట్లు అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. అలాగే యర్రగుంటపల్లి హైస్కూల్‌లో ప్రతిభ చూపిన నిఖిత, అక్షయ, అఖిలకు కూడా రూ.5వేలు, 3వేలు, 2వేలు చొప్పున నగదు బహుమతులు అందించామని తెలిపారు.

టీటీడీసీని సందర్శించిన కేంద్ర బృందం

అనంతపురం అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ శిక్షణాకేంద్రాన్ని కేంద్ర పథకాల పర్యవేక్షణ బృందం అధికారులు సాంబశివరావు, నవ్య సందర్శించారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు తొలిరోజు టీటీడీసీ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు.. తద్వారా సాధించిన ఫలితాలపై ఆరాతీశారు. అనంతరం ఎస్కేయూ సమీపంలోని రూడ్ సెట్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ నిర్వహించే ఉచిత శిక్షణలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 13వ తేదీదాకా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కమిటీ సభ్యులు పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో పలు రకాల పనులను పరిశీలిస్తారు. మంగళవారం గుంతకల్లు మండలం దోసలుడికి, ఈనెల 6న కొంగనపల్లి, 7న నాగసముద్రం, 8న పుట్లూరు మండలం అరకటివేముల, 9న మడ్డిపల్లి, 10న మడుగుపల్లి, 11న విడపనకల్లు మండలం పాల్తూరు, 12న జనార్దనపల్లి, 13న కలెక్టరేట్‌లో సంబంధితశాఖల అధికారులతో సమావేశమవుతారు.

కేంద్ర బృందానికి సహకరించండి..

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పర్యవేక్షించేందుకు వచ్చిన జాతీయస్థాయి మానిటరింగ్ బృందానికి సహకారం అందించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం, డ్వామా, సంబంధిత శా ఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఈనెల 13 వరకు నేషనల్ లెవల్ మానిటర్ టీం జిల్లాలో పర్యటిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి విజయగాథల వివరాలను వారికి తెలపాలన్నారు. సమావేశంలో కేంద్ర బృందం అధికారులు సాంబశివరావు, నవ్య, డ్వామా పీడీ సలీం బాషా, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, డీఆర్‌డీఏ ఏపీడీలు గంగాధర్, సత్యనారాయణ, సర్వే ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

2,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ఇక్కడి నుంచి 2,110 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉండగా ప్రస్తుతం రిజర్వాయరులో 1.79 టీఎంసీల నీటి నిల్వ ఉందని వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, కామర్స్ బోధించడం కోసం అర్హులైన అభ్యర్థులు గురువారం లోపు దరఖాస్తులు చేసుకోవాలని, వారికి 11న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని అన్నారు.

వర్షం కోసం భజనలు

బెళుగుప్ప, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపల్లిలో వర్షం కోసం స్థానిక తాతయ్యస్వామి ఆలయంలో వారం రోజులపాటు నిర్వహించిన శ్రీమద్విరాటపర్వం పఠనం సోమవారంతో ముగిసింది. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేపట్టారు. గ్రామస్థులు శ్రీరామ భజనలు చేస్తూ వీధుల్లో పర్యటించారు. బొడ్రాయికి పూజలు చేశారు.

అక్రమాల గుట్ట

- ఓ వైపు గ్రావెల్ తరలింపు
- మరో వైపు ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు

యాడికి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): యాడికి రెవెన్యూ పరిధిలోని ఓ గుట్ట నుంచి అక్రమంగా గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇలా గ్రావెల్ తరలించడంతో ఏర్పడ్డ ఖాళీ ప్రాంతాన్ని మరో వైపు కబ్జా చేస్తున్నారు. ఇలా అక్రమార్కుల వల్ల గుట్ట తరిగిపోతోంది. యాడికి - తిరుణాంపల్లి ప్రధాన రోడ్డు పక్కలో సర్వేనెంబర్ 422లో సుమారు 40 ఎకరాల్లో గుట్ట ఉంది. ఇందులో కొంత భూమిని ఏడు నెంబర్లతో వివిధ వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. మిగిలిన గుట్ట అంతా ప్రభుత్వ భూమిగానే ఉంది. ఈ గుట్టలోని మట్టి గ్రావెల్‌గా బాగా పనికి వస్తుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎక్స్‌కవేటర్లతో గుట్టను తొవ్వి.. గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. గ్రావెల్‌ను తరలించగా చదును అయిన గుట్ట భాగంలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా సాగు చేసుకొంటున్నారు. గుట్టపైన భాగాన్ని కూడా మరికొందరు వ్యక్తులు ఆక్రమించే దిశగా చదును చేసి సేద్యం పనులు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఈ గుట్టను కాపాడే ప్రయత్నం అధికారులు చేయకపోవడం గమనార్హం. గ్రావెల్‌ను అక్రమంగా తరలించిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గ్రావెల్ కోసం తవ్వేసిన గుట్ట



గ్రావెల్ తరలింపుతో ఏర్పడ్డ ఖాళీ స్థలం

సెల్‌ఫోన్లు వెనక్కు తీసుకోవాలని అంగన్‌వాడీల ధర్నా



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

కణేకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు అనేక యాప్‌లకు సపోర్ట్ చేయడం లేదని, దీంతో పలు విషయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేక పోతున్నామని అంగన్‌వాడీలు వాపోయారు. దీంతో ఆ సెల్‌ఫోన్‌లు వెనక్కి తీసుకుని.. రికార్డులను చేతిరాత ద్వారా రాసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఇందులో అంగన్‌వాడీ సంఘం నాయకులు రామాంజినమ్మ, పార్వతి, అంగన్‌వాడీలు యశోద, సునీత, స్వర్ణలత, అఫ్రోజ్ పాల్గొన్నారు.


ప్రజా నాయకుడికి
పుట్టిన రోజు శుభాకాంక్షలు
జనం మెచ్చిన నాయకుడు...
జనం కోసం నడిచే జన సేవకుడు...
మన కళ్యాణదుర్గం ముద్దు బిడ్డ...
కళ్యాణదుర్గం నియోజకవర్గ శాసనసభ్యుడు
గౌ॥ శ్రీ అమిలినేని సురేంద్రబాబు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
అమిలినేని లక్ష్మినారాయణ
తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి మరియు EX-MPP
కంబదూరు మండలం

యువకుడి ఆత్మహత్య


జగదీష్ (ఫైల్)

రాయదుర్గంరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీపంలోని మల్లాపురం లేఅవుట్‌లో నివాసముంటున్న జగదీష్ (32) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను టైలరింగ్ చేసేవాడు. తన ఇద్దరు అన్నలతో కలిసి నివాసముండేవాడు. జగదీష్‌కు వివాహం కాకపోవడం, ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి


నాగేంద్ర (ఫైల్)

కూడేరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కమ్మూరు గ్రామ సమీపంలో గత నెల 29వ ఆటో బోల్తా పడటంతో కూడేరుకు చెందిన ఆటోడ్రైవర్ నాగేంద్ర నాయక్ (32) తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతను కోలుకోలేక ఆదివారం రాత్రి మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

లారీలు ఢీకొని డ్రైవర్..

విడపనకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామం వద్ద సోమవారం తెల్లవారు జామున రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్, మహారాష్ట్రకు చెందిన జితేందర్‌కుమార్ (35) లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. గడేకల్లు గ్రామస్థులు అతన్ని బయటకు తీసి గుంతకల్లు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మరణించాడు. మరో లారీలోని డ్రైవర్, క్లినర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరు గుంతకల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని క్లీనర్..

యాడికి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం అర్ధరాత్రి రాయలచెరువుకు చెందిన లారీ క్లీనర్ ఉప్పర భరత్‌కుమార్ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడ్డ భరత్‌కుమార్ అక్కడికక్కడే మరణించాడు. అతని తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడు..

కణేకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యంలో ఆదివారం సాయంత్రం నీటిని సరఫరా చేసే ఆటో వడ్డే నాగప్ప(65)ను ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. కోలుకోలేక సోమవారం మరణించాడు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ నాగమధు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి..

రాయదుర్గంరూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బళ్లారి రోడ్డు శాంతినగర్‌లో డేరాలు వేసుకొని నివాసముంటున్న ఎరుకుల కుమారస్వామి (60) సోమవారం మధ్యాహ్నం నిద్రిస్తుండగా.. పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక ఆయన మరణించాడు.

బంగారు గొలుసు చోరీ

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురంలో వెంకటలక్ష్మీ ఆదివారం రాత్రి తన ఇంటి బయట ఒంటరిగా నిద్రిస్తుండగా.. దుండగులు ఆమె మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. ఆమె గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొలమడలో సోమవారం ఓ మట్కాబీటర్‌ను అరెస్ట్‌చేసి అతనివద్ద నుంచి రూ.15,130 నగదు, చిట్టీలు స్వాధీనం చేసుకున్నామని రూరల్ పోలీసులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.


ఉద్దేహాళ్ సొసైటీ వద్ద వేచి ఉన్న రైతులు

యూరియా కోసం పడిగాపులు

బొమ్మనహాళ్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ సొసైటీ వద్ద యూరియా కోసం సోమవారం ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. మార్క్ఫెడ్ వారు యూరియా సరఫరా చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. దీనిపై ఏఓ సాయి కుమార్‌ను వివరణ కోరగా యూరియా కొరత లేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో రైతు సేవా కేంద్రాలకు పంపుతామని అన్నారు.

పరిశ్రమల పేరుతో భూదోపిడీ వద్దు


మాట్లాడుతున్న కార్మిక సంఘం అధ్యక్షుడు సుబ్బారావు

గుత్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సోలార్, గాలి మరలు ప్రాజెక్టుల పేరుతో వ్యవసాయ భూములను లాక్కొని... వాటిన అదానీ, అంబానీలకు కట్టబెట్టరాదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ భూసేకరణ, వాటి పరిణామాలపై సోమవారం స్థానిక షాదీ ఖానాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చర్చా వేదికలో వారు మాట్లాడారు. మార్కెట్ విలువకు నాలు గు రెట్లు విలువ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కార్యదర్శి నరసింహానాయక్, రైతు సంఘం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షు డు సూరిభాస్కర్, మండలకార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ


బొడ్రాయికు పూజలు చేస్తున్న గ్రామస్థులు

కుందుర్పి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లిలో సోమవారం తెల్లవారుజామున బొడ్రాయిని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. భక్తులు గంగాజలంతో అభిషేకం చేశారు. గ్రామంలోని ఆడపిల్లలకు ఒడి బియ్యం పోశారు. గ్రామదేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్నీ నిర్వహించారు. అన్నసంతర్పణం చేశారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

పామిడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)కి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని పలు కులసంఘాల నాయకులు, కార్యకర్తలు కోరారు. ఈ మేరకు ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

యాడికి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): యాడికిలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి.. హైస్కూల్, ప్రభుత్వ వైద్యశాల, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాలను, షాదీఖానాను, కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేశారు. సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, యాడికి సొసైటీ చైర్మన్ చలమారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు బొట్టు శేఖర్, తిరంపురం నీలకంఠ, రవికుమార్‌రెడ్డి, నాగమునిరెడ్డి, త్రినాథ్ రెడ్డి, విశ్వనాథ్ ఉన్నారు.

ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం

గుంతకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 35, 36 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం ఇంటింటి ప్రచారం చేస్తూ.. ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పత్తి హిమబిందు, గుణ శేఖర్, ఫజులు, రామన్నచౌదరి, ఫ్రూట్ మస్తాన్, చికెన్ జగన్, ఓ చంద్రయ్య, విజయలక్ష్మి ఉన్నారు.


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జయరాం

తాగునీటి కోసం రాస్తారోకో



గుత్తి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి రోడ్డులోని జంగాకాలనీ, బుడగ జంగాల కాలనీల్లో నెల రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆ కాలనీల వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తాడిపత్రి రోడ్డుపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. మున్సిపాల్ అధికారులతో చర్చించి త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎస్‌ఐ సురేష్ హామీ ఇవ్వటంతో వారు శాంతించారు.

మా సొమ్ము రికవరీ చేయండి సార్

యాడికి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన సరస్వతి పొదుపు సంఘానికి చెందిన రూ.2 లక్షలు, లలిత పొదుపు సంఘానికి చెందిన రూ.2 లక్షలు, లక్ష్మి పొదుపు సంఘానికి చెందిన రూ.90 వేలను 2017లో వీఓఏ, సీసీ కాజేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని, మా డబ్బును రికవరీ చేయాలని నాటి నుంచి వెలుగు కార్యాలయం, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు సార్.. ఇప్పటికైనా మాకు న్యాయం చేయండి సార్.' అని తూట్రాళ్లపల్లికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు సోమవారం పోలీసులను విజ్ఞప్తి చేశారు.